ఇది బస్‌షెల్టరే!


బస్‌షెల్టర్ చుట్టూ పేరుకుపోయిన కంపచెట్లు

నల్లచెరువు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న దేవరింటిపల్లి, పాలపాటిదిన్నె బస్‌షెల్టర్ అపరిశుభ్రంగా తయారైంది. బస్‌షెల్టర్ చుట్టూ కంప చెట్లు, చెత్త పోరుకుపోవడంతో విష పురుగులు, పాములు సైతం బస్సు షెల్టర్ ఆవరణలో సంచరిస్తున్నాయి. బస్‌షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన లైటును సైతం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో బస్సు షెల్టర్ పక్కన నిలబడాలన్నా విష సర్పాలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. సంబంధింత అధికారులు స్పందించి బస్సు షెల్టర్ చుట్టూ పోరుకుపోయిన కంప చెట్లు, చెత్త తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


కూలడానికి సిద్ధంగా ఉన్న చింత చెట్టు


చెట్టు మొదలును చెద పురుగులు తిన్న దృశ్యం

● పొంచి ఉన్న ముప్పు

ధర్మవరం రూరల్: మండలంలోని కుణుతూరు కాలనీ వద్ద చింత చెట్టు కూలడానికి సిద్ధంగా ఉంది. నిత్యం వందలాది మంది వాహనదారులు ఈ రహదారిపై వెళుతుంటారు. ప్రమాదవశాత్తూ చింత చెట్టు విరిగి రోడ్డుపై వెళ్లుతున్న వాహనదారులపై పడితే ప్రాణాలకే ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. అసలే వర్షాకాలం కావడంతో చెట్టు మొదలు చెదలు పట్టి పడిపోవడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్టును తొలగించి ప్రమాదాన్ని నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఓడీచెరువు: మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1988–89లో పదో తరగతి విద్యార్థులు సమావేశం నిర్వహించారు. దాదాపు 37 ఏళ్ల తర్వాత ఒకచోట కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అప్పటి గురువులు సత్యనారాయణ, నాగరాజారావు, కొండారెడ్డి, రామాంజనేయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మధుసూదన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, నీలోఫర్, భానుబీ, పద్మావతమ్మ, సుధాకర్, గంగాద్రి, రవూఫ్, బాలిరెడ్డి, తిప్పన్న పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 135మందికి కంటి పరీక్షలు చేయగా 85 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికైనట్లు రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణ, విజయభాస్కర్, క్యాంపు చైర్మన్ రిటైర్డ్ వైద్యులు నరసింహులు తెలిపారు. వీరికి బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్స చేస్తారన్నారు. అనంతరం శిబిరం దాతలైన ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు జయశ్రీ, కంటి వైద్యులు నరసింహులును ఘనంగా సత్కరించారు. రోటరీక్లబ్ సభ్యులు శివయ్య, సుదర్శన్‌గుప్త, సత్రసాల ప్రసన్నకుమార్, రత్నశేఖర్‌రెడ్డి, మనోహర్‌గుప్త, జయచంద్ర, రామకృష్ణ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతకు బోనాలు


ఓడీచెరువులో బోనాలు ఎత్తుకెళ్తున్న మహిళలు

ఓడీచెరువు: మహాలయ పౌర్ణమి వేడుకల్లో భాగంగా ఆదివారం ఓడీచెరువు, గౌనిపల్లి, ఆకుతోటపల్లి ఎస్సీకాలనీల్లో ఆదివారం గ్రామదేవత గంగమ్మకు బోనాలు సమర్పించారు. ముందుగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో విందు భోజనాలు ఏర్పాటు చేశారు.
ముదిగుబ్బ: ఎనుములవారిపల్లి ఎస్సీ కాలనీ వాసులు ఆదివారం గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. ఏటా మాల పున్నమి తరువాత గ్రామదేవతలకు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గంగమ్మ, పెద్దమ్మ, సల్లాలమ్మ తదితర దేవతలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి బోనాలను సమర్పించారు. అనంతరం గ్రామ దేవతలకు జంతుబలులను ఇచ్చి మొక్కులను తీర్చుకున్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ లైన్ల మరమ్మతు


విద్యుత్‌లైన్ల కింద ఉన్న చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కనగానపల్లి: మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లకు అధికారులు మరమ్మతు చేపట్టారు. విద్యుత్ ప్రమాదాలపై శుక్రవారం 'సాక్షి'లో ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా.. అనే వార్త వెలువడింది. స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు ఆదివారం మండలంలోని పలు ప్రాంతాలలో పర్యటించి ప్రమాదకంగా ఉన్న విద్యుత్ లైన్లను పరిశీలించారు. ఏఈ కొండారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కనగానపల్లి, మామిళ్లపల్లి, దాదులూరు, కట్టకిందపల్లి తిరిగి విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లను తొలగించారు. నాసికరంగా ఉన్న తీగలు, జంపర్లను మార్చారు.

'చలో అనంతపురం' జయప్రదం చేయండి

తాడిమర్రి: ఆర్డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరణ కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ అఖిల పక్ష కమిటీ సోమవారం తలపెట్టిన హలో ఎస్సీ, ఎస్టీ, బీసీ చలో అనంతపురం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ పొలికేక ధర్మవరం నియోజక వర్గం నాయకులు బండారు పెద్దటబిలేసు, బండారు నాగరాజు, బండారు రామాంజినేయులు, చిల్లవారిపల్లి శివయ్య, దాసగారిపల్లి కుళ్లాయప్ప కోరారు. మండల కేంద్రంలో ఆదివారం వారు కరపత్రాలు విడుదల చేశారు.

ఇమామ్, మౌజన్ల వేతనాలు విడుదల చేయాలి

ఎన్‌పీకుంట: ఇమామ్–మౌజన్లకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేయాలని మండల ఖాజీ, జామియా మసీద్ ఇమామ్ హజ్రత్ బాబ్జాన్ కోరారు. స్థానిక జామియా మసీదులో ఆదివారం ఆయన మాట్లాడుతూ సుమారు 11 నెలలుగా మసీదుల్లో విధులు నిర్వహించే ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాలు నిలిచిపోయాయన్నారు. దీనితో వారంతా జీవనానికి ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి వారి వేతనాలను వెంటనే మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

బాధితుడికి ఆర్థికసాయం

కదిరి అర్బన్: గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతున్న కదిరి మండలం చవిటితండాకు చెందిన 9 ఏళ్ల బాలుడు ప్రజాత్‌నాయక్‌కు ఆదివారం హార్ట్ టు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రవినాయక్ ఆర్థికసాయం అందించారు. చిన్నారి వైద్యం కోసం తల్లిదండ్రులు పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తున్నారని, తన వంతుగా రూ.10 వేలు అందించినట్లు రవినాయక్ తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ


మెడల్స్ అందుకుంటున్న సహృద్

ధర్మవరం: రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ధర్మవరం బీఎస్‌కే చెస్ అకాడమి క్రీడాకారుడు ప్రతిభ కనబరిచి మెడల్, నగదు బహుమతి సాధించినట్లు అకాడమీ కోచ్ ఆదిరత్నకుమార్ తెలిపారు. నంద్యాల జిల్లాలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చెస్ పోటీల్లో బీఎస్‌కే చెస్ అకాడమీ క్రీడాకారుడు ఎంపీ సహృద్ పాల్గొని రాపిడ్ చెస్ విభాగంలో 7 రౌండ్లలో 6 మ్యాచ్‌లు గెలిచి నాల్గవ స్థానంలో నిలిచి రూ.2 వేల నగదు బహుమతి, మెడల్, బ్లిట్జ్ చెస్‌లో 7 మ్యాచ్‌లకు 5 మ్యాచ్‌లు గెలిచి 7వస్థానంలో రూ.వెయ్యి నగదు బహుమతి, మెడల్ కైవసం చేసుకున్నాడని తెలిపారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం


సమావేశమైన పాఠశాలల కరస్పాండెంట్లు

కదిరి: ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం సీఆర్‌ఓ కోటిరెడ్డి రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వాల్మీకి పాఠశాలలో ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్ల మొట్టమొదటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రైవేటు పాఠశాలల్లో విద్యను అందించేందుకు చాలామంది కరస్పాండెంట్లు ఎక్కువ సమయాన్ని పాఠశాలకే కేటాయిస్తున్నారని గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం గౌరవాధ్యక్షుడు సింగారెడ్డి, అధ్యక్షుడు అనిల్ కుమార్‌రెడ్డి, గౌరవ సలహాదారులు శివశంకర్, కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జానపద గాయని సరళకు సన్మానం

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన జానపద గాయని సోమిశెట్టి సరళను అఖిల భారత పద్మశాలి సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. విజయవాడలో ఆదివారం అఖిల భారత పద్మశాలి సంఘం వార్షిక సమావేశ జాతీయ మహాసభలో ధర్మవరానికి చెందిన జానపద గాయని సోమిశెట్టి సరళను సంఘం అధ్యక్షులు కందగడ్ల స్వామి, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి అధ్యక్షులు నాగేశ్వరరావు, మహిళా నాయకుల ఆధ్వర్యంలో శాలువాలు, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. సరళ పాడిన జానపద గీతాలు ఆహూతులను అలరించాయి.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు మోహన్

ముదిగుబ్బ: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని ఏపీయుడబ్ల్యూజే జిల్లా, డివిజన్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో ఏపీయుడబ్ల్యూజే ధర్మవరం రెవెన్యూ డివిజన్ సర్వసభ్య సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి మదనాపు రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జీవీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు జయనందనరెడ్డి, డివిజన్ అధ్యక్షులు జానపాటి మోహన్, ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్‌చౌదరి, జిల్లా కోశాధికారి రాంప్రసాద్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు పీఎం ప్రసాద్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గసభ్యులు పామాల నాగేంద్ర, గోల్డ్ గురుప్రసాద్ హాజరై మాట్లాడారు. అనంతరం యూనియన్ ముదిగుబ్బ మండల అధ్యక్షుడిగా యం.వెంకటనాయుడు, గౌరవాధ్యక్షుడిగా సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా పూల రాజేష్, ప్రధాన కార్యదర్శిగా రఘు, ట్రెజరర్‌గా నరసింహారెడ్డి, సహాయ కార్యదర్శులుగా సిద్దయ్య, నరేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో డివిజన్ ఉపాధ్యక్షులు సి.వీరనారప్ప, సాకే ఆదినారాయణ, మల్లిఖార్జున, సహాయ కార్యదర్శి కుతుబుద్దీన్, చింతా రమణ, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, దొడ్డప్ప, మహమ్మద్‌అలీ, ముదిగుబ్బ మండల అధ్యక్షులు వెంకటనాయుడు, ప్రధాన కార్యదర్శి రఘు, గౌరవాధ్యక్షులు సూర్యనారాయణలతో పాటు మండల విలేకర్లు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ మేధావి.. మోక్షగుండం

సందర్భం
నేడు ఇంజినీర్స్‌డే

- నేడు విశ్వేశ్వరయ్య జయంతి
- ఇంజినీర్స్ డే నిర్వహించనున్న కళాశాలలు




విశ్వేశ్వరయ్య (ఫైల్)

అనంతపురం /అనంతపురం కల్చరల్: దేశ సమగ్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ఇంజినీర్లకు మార్గదర్శిగా, భారతజాతి కీర్తి ప్రతిష్టలు సుసంపన్నం చేసిన మహోన్నత వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా మిగిలిపోయాయి. ఏటా సెప్టెంబర్ 15న మోక్షగుండం జయంతి సందర్భంగా ఇంజినీర్స్‌డేను జరుపుకుంటారు.

కరువు సీమలో సాంకేతిక కల్పతరువు..

మోక్షగుండం స్ఫూర్తితో ఆయన అందించిన ప్రేరణతో దేశమంతటా అపురూప కట్టడాలు రూపుదిద్దుకున్నాయి. అనంతలోనూ నాటి ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పట్టే కట్టడాలు ఎన్నో ఉన్నాయి. ఆర్ట్స్ కాలేజీ, జిల్లా కోర్టు ప్రాంగణం, రెవెన్యూ భవనాలు చెక్కుచెదరని, అద్భుత కట్టడాలుగా నిలిచాయి. అందులో అనంత కరువు సీమలో సాంకేతిక కల్పతరువుగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూఏ 1949లో ప్రారంభమైంది. 2008లో వర్సిటీగా ఆవిర్భవించింది. ఏటా 90 వేల మందికి పైగా విద్యార్థులు జేఎన్‌టీయూ పరిధిలో చదువుకుంటూ భావి ఇంజినీర్లుగా వస్తున్నారు. వైఎస్సార్ సీఎం కాకమునుపు నూటికొకరు ఇంజినీర్లు ఉండేవారు. ఇంజినీర్ కావాలన్న ప్రతి ఒక్కరి కల సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌దే. ఆయన హయాంలో ఇంజినీరింగ్ కళాశాలలను విరివిగా పెంచారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించి ఎందరినో ఉన్నత విద్యావంతులను చేశారు. ప్రతిభావంతులైన 'అనంత' ఇంజినీర్లు వినూత్న ఆవిష్కరణలతో రాష్ట్రంలోనే తలమానికంగా నిలిచారు. ప్రస్తుత రోజుల్లో కేవలం ఇంజినీరింగ్ మాత్రమే ప్రధాన ఉపాధిగా మారడం వెనుక ఆయన కృషి అపారం.